మినీ కథ

# మరమరాలు

పి.పవన్ కుమార్

"అమ్మా! ఆకలి!!"... "అమ్మా! ఆకలి" అని ఏడ్చి ఏడ్చి స్పృహ తప్పిన వాడిలా పడుకుండి పోయాడు ఏడేళ్ళ కోటి. వాడిని చూస్తుంటే ఆ తల్లికి కడుపు తరుక్కు పోయింది - ఎంత దుర్మార్గుడు తన భర్త! తల్చుకుంటేనే ఆమెకి బాధ, కోపం కలుగుతున్నాయి. ఒక్కగా నొక్క కొడుకుని కూడా సరిగా పోషించ లేకపోతున్నారు.

ఆమెకి ఎనిమిదిన్నర ఏళ్ళ కిందటి మాట గుర్తొచ్చింది. అప్పుడు ... తన వయసు పాతి కేళ్ళు. నాన్న అయిదో తరగతి దాకా చదివించాడు. ఆ రోజుల్లో ఆచారాన్ని బట్టే గాని లేకుంటే నాన్న ఎక్కువే చదివించే వాడు. అలా జరిగే ఉంటే అసలు తా నీ అవస్థ లెందుకు పడేదీ! తన కోసం చాలా సంబంధాలే వచ్చాయి. అన్నీ తనకు నచ్చినవే! కాని నాన్నకే నచ్చ లేదు! ఆస్తి లేని వాళ్ళని, అన్నదమ్ము లెక్కువ మంది ఉంటే తోటి కోడళ్ళు సరిగా ఉండరనే ఉద్దేశంతో తనని ఒక్కడే కొడుకు ఉన్న ఇంటి కప్పజెప్పాలనే చూశాడు. చివరికి దొరికింది - రాఘవులు సంబంధం. రాఘవులు అక్షరాలా 'ల'కారాలు ఉన్నవాడే. తండ్రికి ఆనందపు అంచులు కనబడ లేదు. తనకి నచ్చలేదని సూచనగా అన్నా మాట వినలేదు - పెళ్ళి జరిగిపోయింది.

పెళ్ళి జరిగిన రెండు సంవత్సరాల కల్లా తన భర్త గురించి పూర్తిగా తెలుసుకునే లోపలే అతన్ని కున్న 'ల'కారాలు ఖర్చై పోయాయి. అప్పు డిక ఆమె పేర ఉన్న కొద్దిపాటి ఆస్తి మీదా పడ్డాడు. తను ఒప్పుకోకపోతే సిగరెట్ కాల్చి వాతలు పెట్టేవాడు - బాధలు భరించ లేక ఆస్తి వదులుకుంది.

కొడుకు పుట్టి మూడేళ్ళు వాడయ్యేసరికి రాఘవులు బికారి అయ్యాడు. చేతిలో చిల్లి గవ్వలేని పరిస్థితి.

అప్పుడే ... సరిగ్గా నాలుగేళ్ళ కిందట ...

ఒకరోజు తనని పని చెయ్యమని వత్తిడి చేశాడు రాఘవులు. ఎంతైనా ఉన్నత కుటుంబం నుంచి రావడం మూలాన, కొద్దో గొప్పో చదువుకుని ఉండటం వల్ల ఆమె ససేమీరా అంగీకరించ లేదు. ఐతే మాత్రం - అతని విద్యలు అతనికి లేవూ?

ఆమె చేత ఒప్పించాడు. తనే పని చూపించాడు. ఓ ధనవంతుల ఇంట్లో రెండొందల జీతానికి. రోజంతా వాళ్ళింట్లోనే ఉండాలి. అన్నం వండడం నుంచి గిన్నెలు తోమటం దాకా చెయ్యాలి.

వాళ్ళు పెట్టే కష్టాలు భరించ లేకున్నా తన భర్త పెట్టే హింసల కంటే తేలికేనని ఆమె ఇరవై నాలుగ్గంటల్లో దాదాపు పదిహేను గంటలు అక్కడే గడిపేస్తోంది - కొడుకుని వెంట తిప్పుకుంటూ. ఒక్క కొడుక్కి తోడు ఇంకో కొడుకో - కూతురో పుడితే బావుండు అనుకుంటున్న సమయంలో అదీ పడనీయ లేదు. ప్రభుత్వం వారు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకుంటే డబ్బిస్తారనే ఆలోచన రాగానే ఆమెకి చేయించేశాడు - ఒక రెండ్రోజులు మందుకీ, జూదానికీ వస్తాయ కనుక. ఆ రోజుల్లో ఆమె మందు గురించి కూడా ఆలోచించలే దతను.

అంతా సహించింది. తన 'కర్మ' అనుకుని కానీ నిన్న ..?

తను జీతం వచ్చాక ఇస్తానని పక్కింటావిణ్ణి అడిగితీసుకున్న రెండు రూపాయలూ పిల్లాడికి గంజి పోద్దామనే ఆలోచనే లేకుండా తీసుకుపోయాడు ఆ దుర్మార్గుడు. తను ఎదురు తిరిగిందని కట్టెపేడుతో కొట్టాడు. అంతటితో ఆగక ఆమెపై కసితో పని తీయించేశాడు.

* * * * * *

ఆలోచనల నుంచి తేరుకొని పక్కకు చూసేసరికి కొడుకు కనపళ్ళేదు. ఆమె కదలవాలేదు. వాడు ఆకలి భరించ లేక ఏ కొట్టుకోపోయి సామాను కొనేవాడిలా కూర్చుని బియ్యమో, శనగ పప్పో తినేసి వస్తుంటాడు. నిన్న గుచ్చుకున్న కట్టెపేడు చేతి లోపలికి పోయి - చీము పట్టి సలపరింతగా అన్పించి కళ్ళు మూసుకు పడుకుంది - ఒట్టి నేల మీదే.

నిద్ర పట్టేసింది కొద్ది సేపటికే. ఆమెకి నిద్రలో కూడా అంధకారమయం కాబోతున్న తన బ్రతుకు, అంత కంటే కొడుకు భవిష్యత్తు మదిలో మెదిలి తెలియకుండానే చిన్న మూలుగు వినిపించీ వినిపించనంతగా వచ్చింది.

"అమ్మా! అమ్మా!" అంటూ కొడుకు లేపటంతో మెలకువ వచ్చిం దామెకి.

"అమ్మా! మరమరా లివిగో" అంటూ తల్లి చేతిలో పోశాడు.

"ఎక్కడివిరా" అంటూనే చేతిలోకి చూసిన ఆమెకి మనస్సు కలుక్కుమంది.

"ఏమిటి! తను చూస్తున్నది నిజమేనా?" అనిపించి గిల్లుకుంది.

నిజమే!

ఏడుపాగలే దామెకి.

కోటిగాడు మాత్రం అదేం పట్టకుండా ఆ రంగు మరమరాల్ని ఐదు పైసల బిళ్ళల్ని చిరిగిపోయిన లాగూ జేబులోంచి తీసి తల్లి చేతుల్లో పోస్తున్నాడు ఆనందంగా.

ఆమె షాక్ నుంచి తేరుకునే లోపల వాడు మళ్ళీ అదృశ్యమయ్యాడు. చేతిలోని పైసల్ని లెక్కేయ బోయింది. ఆమె మనసు నిలవలేదు. వాడు రేపు తను పోతే చేయబోయే పని మదిలో మెదిలింది. ఔను.

ఆమె మరణించింది. చుట్టు పక్కల వాళ్ళు తలా కొంత వేసి, ఆమె అంత్యక్రియలు చేస్తున్నారు. అప్పుడు కూడా ఆమె భర్త రాఘవులు ఏమీ పట్టకుండా కూర్చున్నాడు. కొడుకు "అమ్మా! ఆకలి!" అనే ఏడుస్తున్నాడు - చచ్చి పోవడ మంటే అర్థం తెలీక.

ఆమెని పాడె మీద పడుకో బెట్టి తీసుకెడుతున్నారు - ఎవరో గానీ!

అప్పుడు ... అప్పుడు ...

ఆమె పాడె మీద ఎవరో చల్లుతున్న మరమరాల్ని కొడుకు ఏరుకు తింటుంటే, డబ్బులు భర్త ఏరుకుని 'మందు'కి పోతున్నాడు. ఆమె అంత కంటే లోపలకి ఊహించ లేకపోయింది. ఏడ్చి ఏడ్చి డెక్కె పట్టింది. అంతే ఆమె ఊహించుకున్నట్టే మరణించింది - ఆ తర్వాతేం జరిగిందో గానీ?

